క్లుప్తంగా

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, మంచి నీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ సీనియర్ నాయకులు ధీరజ్‌రెడ్డి అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో వివిధ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు ముంత రాములు యాదవ్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 19, వంకాయ 28, బెండ 31, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, క్యారెట్ 37, దొండ 18, ఆలు 20, ఉల్లిగడ్డ 12, గోకర 40, దోస 15, సొర 15, పొట్లకాయ 13, అరటి 11, చిక్కుడు 55, అర్వి 35, మునగ 48, చిలగడదుంప 50, బీట్‌రూట్ 19, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 65. ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

భాషా పండితులకు పదోన్నతులు ఇవ్వాలి

చాదర్‌ఘాట్: తెలంగాణలోని భాషోపాధ్యాయులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిట్ పరిషత్ (ఆర్‌యూపీపీ) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.విజయభాస్కర్ డిమాండ్ చేశారు.ఆదివారం ఆయన మలక్‌పేటలో మాట్లాడుతూ.. 2017లో జరిగిన ప్రపంచ మహాసభలో బాషోపాధ్యాయుల పదోన్నతుల్లో అడ్డంకులు తొలగించి పదోన్నతులు కల్పిస్తామన్న సీఎం కేసీఆర్ తన హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో భాషా పండితులు మూడు దశాబ్దాలుగా ఉన్నత పాఠశాలల్లో బోధిస్తూ ప్రాథమిక పాఠశాల వేతనాలు మాత్రమే పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

పార్కు స్థలాల అభివృద్ధికి కృషి



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ ఫ్రీడమ్ పార్కులో అభివృద్ధి పనులు పూర్తి కావడంతో ఆదివారం కాలనీ వాసులతో కలసి కార్పొరేటర్ పార్కును పరిశీలించారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ముదుపు సందీప్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేయాలి



మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

లింగోజిగూడ: డివిజన్‌లో పార్టీ పటిష్టతకు అందరు కలికట్టుగా కృషి చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు.కొత్తపేట డివిజన్ బీజేపీ కార్యవర్గ సమావేశం ఆదివారం న్యూనాగోలు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. రాబోయె ఎన్నికల్లో ఎల్‌బీనగర్‌లో బీజేపీ జెండా ఎగరవేయాలని, అధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్ళెం నవజీవన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కింది స్థాయిలో పర్యవేక్షణ లేక పోవడంతో కార్మికులు నిర్లక్ష్యంగా పని చేస్తున్నారని, వారిపని తీరుపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. సూపర్‌వైజర్లు మధు, వెంకట్‌రెడ్డి, నగేష్‌యాదవ్, మల్లేష్, నగేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కాలనీలో సమస్యల దరువు

- చినుకు పడ్డా వెన్నులో వణుకే
- విస్తరణకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ, ఓపెన్ నాలాలు
- గుంతలుగా మారిన కాలనీ ప్రధాన రహదారి



గుంతలుగా మారిన కాలనీ ప్రధాన రహదారి

చంపాపేట: కాలనీ ఏర్పడి నాలుగున్నర దశాబ్దాలు గడుస్తున్నా పెరుగుతున్న కాలనీ జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించక పోవటంతో కాలనీవాసులు సమస్యలతోనే సహజీవనం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. చంపాపేట డివిజన్ రెడ్డి కాలనీలో గుంతలుగా మారిన కాలనీ ప్రధాన రహదారి, విస్తరణ, పూడికతీతకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ, ఓపెన్ నాలాలు, వేలాడే విద్యుత్ తీగలు, చెత్త డంపింగ్ కేంద్రంగా మారిన ఖాళీ స్థలం, మ్యాన్‌హోల్స్ నుంచి ఉబికి ప్రవహిస్తున్న మురుగు తదితర వంటి సమస్యలతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు స్థానిక కాలనీవాసలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చినుకు పడ్డా వెన్నులో వణుకే

- ప్రతి వర్షాకాలంలో చినుకు పడ్డా రెడ్డి కాలనీలోకి ఎగువనున్న కాలనీల నుంచి ప్రవహించే వరద నీరు రెడ్డి కాలనీని ముంచెత్తటం పరిపాటిగా మారింది.
- కొన్ని కాలనీలలో వరద నీటి ముంపు సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల ఎగువ కాలనీల నుంచి రెడ్డి కాలనీ ప్రధాన రహదారి వరకు మాత్రమే వరదనీటి కాలవల ఏర్పాటుచేసి వదిలి వేశారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

విస్తరణకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ, ఓపెన్ నాలలు

కాలనీలోని భూగర్భ డ్రైనేజీ, ఓపెన్ నాలాలు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరణకు నోచుకోక పోవటమే కాకుండా పూడికతీత పనులు చేపట్టడం లేదని, దీంతో కాలనీలో మురుగు పరుగు సమస్య తలెత్తి ఆయా ప్రాంతాలు దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారి తమకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త డంపింగ్‌గా మారిన ఖాళీస్థలం

రెడ్డి కాలనీకి సరిహద్దులోని ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ ఖాళీస్థలం దశాబ్దాలుగా ఖాళీగా ఉండటంతో పరిసర కాలనీవాసులు చెత్త డంపింగ్ కేంద్రంగా మార్చటమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలానికి ప్రహరీ గోడ నిర్మించేటట్లు ప్లాట్ యజమానికి ఆదేశాలు ఇవ్వాలని వారు అధికారులను కోరుతున్నారు.

గుంతలుగా మారిన కాలనీ ప్రధాన రహదారి

కాలనీ ప్రధాన రహదారి గత కొన్ని నెలలుగా గుంతలుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందిని అధికారులకు పలు మార్లు సమస్యపై విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని కాలనీవాసులు వాపోయారు.



చెత్త డంపింగ్‌గా మారిన కాలనీ సరిహద్దు టెలిఫోన్ కాలనీ ఖాళీ స్థలం



మ్యాన్‌హోల్ నుంచి మురుగు పరుగు

మా కాలనీ అంటే ఎందుకు నిర్లక్ష్యం?



అన్ని రకాల పన్నులు సకాలంలో పెండింగ్ లేకుండా చెల్లిస్తున్నాం. పత్తాలేని ఫాగింగ్, మురుగు పరుగు, గతుకుల రోడ్లు, ముక్కు పుటాలు అదిరే దుర్గంధం, విస్తరణకు నోచుకోని నాలాలు, చెత్త డంపింగ్ సమస్యల నడుమే సహజీవనం చేయాలా. మాకాలనీ అంటే ఎందుకీ నిర్లక్ష్యం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

– రఘుమారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు

నకిలీ ధృవపత్రాలతో రుణం

బ్యాంకును బురిడీ కొట్టించిన మహిళ

లింగోజిగూడ: హోటల్‌లో పని చేస్తున్న ఓ మహిళ హోటల్ తనదేనని నకిలీ ధృవ పత్రాలు సృష్టించి ఓ జాతీయ బ్యాంక్‌లో లోన్ తీసుకున్న సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హోటల్ యజమాని సురేష్, స్థల యజమాని కుమారుడు చంద్రశేఖర్ తెలిపిన మేరకు.. ఎల్‌బీనగర్ ఆర్‌టీసీ కాలనీలోని ప్లాట్ నెం 68ను 2015లో కనికారం కమలాక్షి నుంచి వనస్థలిపురానికి చెందిన సురేష్ లీజ్‌కు తీసుకోని బాలజీ మెస్ పేరుతో హోటల్‌ను నడుపుతున్నాడు. 2016లో కమలాక్షి మృతి చెందడంతో ఆమె కుమారుడు చంద్రశేఖర్ నుంచి లీజ్‌ను సురేష్ పొడిగించుకున్నాడు. సురేష్ వద్ద బాలజీ హోటల్‌లో గత కొన్ని సంవత్సరాలుగా భరత్‌కుమార్ అనే వ్యక్తి సూపర్‌వైజర్‌గా పని చేసేవాడు. కరోన కాలంలో భరత్ కుమార్ మృతి చెందడంతో 2021 ఆగస్టులో అతని భార్య పత్తిపాక శోభ ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే అతని స్థానంలో సూపర్ వైజర్‌గా సురేష్ నియమించాడు. హోటల్ యజమాని ఇతర వ్యాపారాల కారణంగా హోటల్‌ను పట్టించుకోవడంలో అలసత్వం వహించాడు. ఇదే అదనుగా భావించిన శోభ 2016లో చనిపోయిన ప్లాట్ యజమాని కమలాక్షి తనకు స్థలాన్ని 2022లో లీజ్‌కు ఇచ్చినట్లు, హోటల్ తనదేనని నకిలీ ధృవ పత్రాలు సృష్టించి కొత్తపేటలోని ఓ జాతీయ బ్యాంక్‌లో సుమారు రూ.25 లక్షలు లోన్ తీసుకుంది. 2023 మొదటి నెలలో తన హోటల్‌పై లోన్ తీసుకున్నట్లు తెలుసుకున్న సురేష్ ఈ విషయంపై శోభను ప్రశ్నించాడు. కొన్ని రోజుల పాటు మాటా దాటేసిన శోభను సురేష్ గట్టిగా ప్రశ్నించే సరికి హోటల్ తనదేనని సురేష్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.దీంతో హోటల్ యజమాని సురేష్, స్థల యజమాని కుమారుడు చంద్రశేఖర్‌లు పూర్తి ఆధారాలతో శోభ నకిలీ ధృవ పత్రాల వ్యవహారంపై గత నెలలోఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.అప్పటి నుంచి శోభను అరెస్ట్ చేయడంలో పోలీసులు తాత్సరం చేయడంతో ఈ విషయంపై భాధితులు ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డిని సంప్రదించడంతో వెంటనే శోభను అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు భాధితులు పేర్కొంటున్నారు.

రెండు రోజుల్లో అరెస్టుచేస్తాం : ఎస్‌ఐ

శోభ తప్పించుకొని నగరం వదిలి వెళ్లిందని, ఆమె వివరాల కోసం పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని రెండు రోజులలో అరెస్ట్ చేస్తామని ఎల్‌బీనగర్ ఎస్‌ఐ మధు విలేకరులు అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు.

క్రీడలకు ప్రాధాన్యం

బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్



రంగారెడ్డి జిల్లా కబడ్డీ జట్టుతో కరచాలనం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ చైర్మన్ గజ్జెల నాగేష్



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళా క్రీడాకారులు

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్ అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్–2023 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువు, క్రీడలు రెండు కళ్లలాంటివని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ యాదవ్, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతీ దివాకర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 1334 మంది క్రీడాకారులు వాలీబాల్, కబడ్డీ, జిమ్నాస్టిక్స్‌లో 33 జిల్లాల నుంచి మొత్తం 1,334 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగురోజుల పాటు పోటీలు జరుగనున్నాయి.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి



భీమానగర్‌లో కాలనీ వాసులతో కలిసి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. భీమానగర్ నుండి హుడాభారతి కాలనీ వరకు ఎస్‌ఎన్‌డీపీ పనులు పూర్తి చేస్తామని సుజాతనాయక్ వెల్లడించారు. ఎన్నోసంవత్సరాలుగా వర్షపు నీటితో ఇబ్బందులు పడుతున్నా ఆయా కాలనీలో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదముంపు ప్రాంతాలలో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సుజాతనాయక్ వెల్లడించారు.బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సాయియాదవ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సూర్యోదయకాలనీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: పారిశుద్ధ్యం నిర్వహణపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని సూర్యోదయకాలనీలో కార్పొరేటర్ ఆదివారం పర్యటించారు. కాలనీలోని రోడ్లను శుభ్రం చేయటంలేదని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తొలగించడంలేదని కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ఎక్కడి పడితే అక్కడ చెత్త కుప్పలున్నాయని, ముకుమ్మడిగా పనులు చేపట్టి చెత్తను వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. కాలనీలోని రోడ్లపై గుంతలు ఏర్పాడ్డాయని, గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎన్టీఆర్ మనవడు చైతన్యకృష్ణ

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

వనస్థలిపురం: మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దేశానికి, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వనస్థలిపురం పనామా చౌరస్తాలో ఉన్న ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాళులర్పించారు. పనామా చౌరస్తాను ఇకపై ఎన్టీఆర్ చౌరస్తాగా నామకరణం చేస్తున్నామని అందరు ఇకపై ఎన్టీఆర్ చౌరస్తాగా పిలవాలని అన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్‌దే విజయం

చల్లా నర్సింహా రెడ్డి



హుస్సేన్ యెమానీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చల్లా నర్సింహా రెడ్డి

పహాడీషరీఫ్: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీదే విజయమని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కొత్తపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ హుస్సేన్ యెమానీ తన అనుచరులతో కలిసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి చల్లా నర్సింహారెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, అమరేందర్ రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని సమస్యలను పరిష్కరించడంలో మంత్రి సబితారెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. గతంలో పేదలకు రాజీవ్ గృహకల్ప ఇళ్లు ఇచ్చినప్పటికీ.. ప్రస్తుత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేక పోతోందన్నారు. తెలంగాణలో కర్నాటక ఫలితాలే పునరావృతం కానున్నాయని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగేటి మధుసూదన్‌రెడ్డి, అహ్మద్ బామ్, అఫ్జల్, షరీఫ్ హుస్సేన్ బిన్ అబ్దుల్లా, యూసుఫ్ ఖాద్రీ, బారీ పాల్గొన్నారు.

వీరశైవుల మనోభావాలు దెబ్బతీయొద్దు

చంపాపేట: హిందూ ధర్మ సంస్కృతి ఆధారంగా వీరశైవ లింగాయత్‌లు వేరుకారని కొందరు రాజకీయ లబ్ధి, స్వార్థ ప్రయోజనాలకోసం వేరు చేయాలని చూస్తున్నారని రాష్ట్ర వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘ మహిళా విభాగ అధ్యక్షురాలు రుద్రమదేవి అన్నారు. ఆదివారం చంపాపేటలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... వీరశైవ లింగాయత్ పేరిటనే రాష్ట్ర ప్రభుత్వం పలు జిల్లాల్లో ఆత్మగౌరవ భవనాలకు స్థలాలు, ఆర్థిక సహాయం చేయటమే కాకుండా భవనాల నిర్మాణానికి భారీ ఎత్తున నిధులు మంజూరయ్యాయన్నారు. వీరశైవుల మనోభావాలు దెబ్బతీసేందుకు కొందరు లింగాయత్‌ల పేరిట ర్యాలీలు తీయటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

యువకుడి మెడలో చైన్ స్నాచింగ్

చైతన్యపురి: బైక్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు ఓ యువకుడి మెడలోని చైన్ స్నాచింగ్ చేసిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మాదన్నపేటకు చెందిన లింగాల సాయప్రసాద్ (25) ఉప్పల్ జెన్‌పాక్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో తన స్నేహితుడు పవన్‌తో కలిసి టిఫిన్ చేసేందుకు చైతన్యపురి చౌరస్తాకు వచ్చాడు. రోడ్డుపక్కన నిలబడి ఉండగా నంబర్‌లేని పాత యాక్టివా ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు అగంతకులు సాయిప్రసాద్ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కొని ఎల్‌బీనగర్ వైపు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటనా స్థలంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కౌన్సిలర్ అహ్మద్ కసాది



కౌన్సిలర్ అహ్మద్ కసాదిని సన్మానిస్తున్న స్థానికులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న కౌన్సిలర్ అహ్మద్ కసాదిని స్థానిక కాలనీల ప్రజలు ఆదివారం సన్మానించారు. కాలనీలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వరదనీటి సమస్య పరిష్కారం కోసం మంత్రి సబితారెడ్డి రూ.10 కోట్లతో డ్రైయిన్‌బాక్స్ నిర్మాణం చేయించారు. దీంతో పాటు భూగర్భ డ్రైనేజీ పనులు కూడా చేపడుతుండటంతో ఇకపై కాలనీలో సమస్యల చింత ఉండబోదని స్థానికులు పేర్కొన్నారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ...మంత్రి సబితారెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, చైర్మన్ అబ్దుల్లా సాదీ, ఎంఐఎం ఇన్‌చార్జి అహ్మద్ సాదిల సహకారంతో మూడో వార్డులో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నెలల తరబడిగా నీటిలో మునిగిన రహదారులకు డ్రైయిన్ బాక్స్ నిర్మాణంతో విముక్తి కలగనుందన్నారు.

వీర్ సావర్కర్‌కు ఘన నివాళి



సావర్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: వినాయక్ దామోదార్ సావర్కర్ జాతీయ వాద రాజకీయ భావ జాల అభివృద్ధికి కృషి చేశారని మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సలీంనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సావర్కర్ 140వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్.. సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవల్ని కొనియాడారు. అనంతరం దేశ ప్రధాని మన్‌కీ బాత్, నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని నాయకులతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, కొప్పుల దినేష్, సురేందర్ పాల్గొన్నారు.

కార్యవర్గ సమావేశం



చింతలకుంటలో సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

వనస్థలిపురం: డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం ఎల్‌బీనగర్ చింతలకుంటలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. నల్లగొండలోని అంధుల పాఠశాల ఈ జూన్ నుంచి నడవదని, ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు ఇప్పటికే తెలియజేశామన్నారు. నల్లగొండ జిల్లా విద్యాధికారి సిఫారసులను పరిగణలోకి తీసు కొని పాఠశాలకు క్లోజర్ సర్టిఫికేట్ ఇస్తూ తమ పాఠశాల ప్రాంగణంలో అభిజ్ఞాన్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ వారి అరోరా పాఠశాలకు అనుమతి ఇవ్వా లని వారు కోరారు. అసోసియేషన్ అధ్యక్షులు జి.అజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఎం.ఏ.ముక్తాధర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి
- బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

బడంగ్‌పేట్: సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌ల్లో రూ.4.22 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించేందుకు ముఖ్యఅతిధిగా మంత్రి సబితారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతోనే మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వరద నీటి కాల్వ నిర్మాణం, ప్రధాన రోడ్ల విస్తరణ, మిషన్ భగీరథ మంచినీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాల్‌లు, ముఖ్యంగా వైకుంఠ ధామాలు ఇలా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. దీంతో మహేశ్వరం నియోజకవర్గంతో పాటు బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీఈ అశోక్‌రెడ్డి, కార్పొరేటర్లు స్వప్న, పి.శోభా, పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.అర్జున్, అనిత, పి.సుదర్శన్‌రెడ్డి, భారతమ్మ, మమత, ఏ.రాంరెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.